# సాక్షి నిజామాబాద్

గురువారం । 30 । నవంబర్ । 2023




## ఓటుకు వేళాయే

శాసనసభ ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ మరికొద్ది సేపట్లో మొదలు కానుంది. పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సిబ్బంది సామగ్రితో కేంద్రాలకు చేరుకున్నారు. గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. ఆయా కేంద్రాల్లో అధికారులు వసతులు కల్పించారు.

- వివరాలు 8లో..

నగరంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో ఎన్నికల సిబ్బందికి అందించిన ఈవీఎం

# ఓటుకు వేళాయే



నగరంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో ఈవీఎంలతో ఎన్నికల సిబ్బంది



- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- పోలింగ్ సామగ్రితో గ్రామాలకు చేరుకున్న సిబ్బంది

సుభాష్‌నగర్: శాసనసభ ఎన్నికల్లో కీలక ఘట్టమైన ఓట్ల పండుగకు సమయం ఆసన్నమైంది. గురువారం ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభం కానుంది. అందుకు తగిన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. ఇప్పటికే జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఓటర్లకు ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తయ్యింది. మొత్తం 77 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బుధవారం ఆరు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. ఇప్పటికే సామగ్రితో సిబ్బంది గ్రామాలకు చేరుకున్నారు. పంచాయతీ సెక్రెటరీలు పోలింగ్ సిబ్బందికి వసతి ఏర్పాట్లు చేస్తున్నారు.

**1,549 పోలింగ్ కేంద్రాలు**

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో 833 లోకేషన్లలో 1,549 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 13,94,986 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 2,298 మంది (80ఏళ్ల పైబడిన, వికలాంగులు) ఓట్ ఫ్రం హోం వినియోగించుకున్నారు. 7,863 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్, ఇతర జిల్లాల్లో 1,447 మంది ఓటు వేశారు. ఓటర్లు గందరగోళానికి గురి కాకుండా ఉండేందుకు పూర్తి సమాచారంతో కూడిన స్లిప్పులు పంపిణీ చేశారు. ఓటరు కార్డు లేకపోయినా, ఎన్నికల సంఘం నిర్దేశించిన ఇతర 12 రకాల గుర్తింపు కార్డులో ఏదైనా ఒక దానిని వెంట తెచ్చుకుని ఓటు వేయొచ్చు.

**ఎన్నికల విధుల్లో 7,458 మంది**

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పీవోలు 1,864 మంది, ఏపీవోలు 1,867, ఓపీవోలు 3,727 కలుపుకుని మొత్తం 7,458 మంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. ఎన్నికలు సాఫీగా సాగేందుకు, ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా 143 సెక్టార్లను ఏర్పాటు చేస్తూ ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలను నియమించారు. 2,352 బ్యాలెట్ యూనిట్లు (25శాతం అదనం), కంట్రోల్ యూనిట్లు 1,957 (25శాతం అదనం), 2,186 వీవీ ప్యాట్లు (40శాతం అదనం) నియోజకవర్గ కేంద్రాల్లోని స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపర్చారు. ఉదయం 6.30 గంటలకే ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది.

**సమస్యాత్మక కేంద్రాల్లో బందోబస్తు.**

జిల్లాలో 455 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా 3,000పైచిలుకు మందితో అన్ని కేంద్రాల వద్ద భద్రత ఏర్పాటు చేస్తున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాలను మోహరిస్తున్నారు. స్థానిక పోలీస్ సిబ్బంది, మహారాష్ట్ర పోలీసులతోపాటు తొమ్మిది కంపెనీల కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. ఎన్నికల నియమావళి అమలు పరిశీలించేందుకు 107 మొబైల్ పార్టీ బృందాలను ఏర్పాటుచేశారు.

**పోలింగ్ కేంద్రాల్లో వసతులు**

జిల్లాలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సిబ్బంది సామగ్రితో గ్రామాలకు చేరుకున్నారు. ఉదయం 6.30గంటల నుంచే పోలింగ్‌కు ఏర్పాటు చేస్తుండటంతో బుధవారం రాత్రి అక్కడే బస చేశారు. పోలింగ్ సిబ్బంది బాధ్యతలను పంచాయతీ సెక్రెటరీలకు అప్పగించారు. కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు చేశారు. ర్యాంప్, టాయిలెట్స్, విద్యుత్ సరఫరా, నీటి వసతి, వీల్‌చైర్స్ తదితర సదుపాయాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను వెబ్ కాస్టింగ్ ద్వారా కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయనున్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున యువత, మహిళా, వికలాంగ, మోడల్ పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు.



మోడల్ పోలింగ్ కేంద్రాలు

